# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 20, మే 2026


# రూ.21.49 లక్షల విలువైన నకిలీ వరి విత్తనాలు పట్టివేత

✦ మహారాష్ట్ర నుంచి తెలంగాణకు అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

✦ రాపన్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద 30.7 టన్నుల విత్తనాలు, లారీ స్వాధీనం.. నలుగురిపై కేసు నమోదు




**కోటపల్లి, మే 19 ప్రభాతవార్త**

లాభార్జనే ధ్యేయంగా నకిలీ, అనుమతులు లేని విత్తనాలను విక్రయించి రైతులను నిలువునా ముంచేందుకు యత్నిస్తున్న ఒక అంతర్రాష్ట్ర ముఠా గుట్టును కోటపల్లి పోలీసులు రట్టు చేశారు. సరైన అనుమతులు, బిల్లులు లేకుండా మహారాష్ట్ర నుండి లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 30,700 కిలోల 30.7 టన్నులు వరి విత్తనాలను రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.21,49,000 ఉంటుందని జైపూర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏసీపీ ఏ. వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంగళవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వివరించారు.

కోటపల్లి మండల వ్యవసాయ అధికారి ఏఓ సాయి కృష్ణరెడ్డి ఇచ్చిన ముందస్తు సమాచారం, ఫిర్యాదు మేరకు కోటపల్లి ఎస్సై ఆధ్వర్యంలో రాపన్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని సిరోంచా ప్రాంతం నుండి తెలంగాణలోని మనకొండూర్ వైపు వెళ్తున్న టీఎస్ 29టీబీ 6555 నెంబర్ గల లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో లోడ్ చేసి ఉన్న భారీ వరి విత్తనాల బస్తాలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, అధికారిక లేబుల్స్, ధృవీకరణ పత్రాలు సర్టిఫికెట్లు, బిల్లులు లేవని గుర్తించారు. విత్తనాల ప్యాకింగ్ కూడా చట్టబద్ధంగా లేకపోవడంతో, వాటిని సీడ్స్ యాక్ట్ 1966, సీడ్ కంట్రోల్ ఆర్డర్1983 నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు నిర్ధారించి సీజ్ చేశారు. విత్తనాల నాణ్యతను పరిశీలించేందుకు నమూనాలను శాంపిల్స్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ అనుమతి పొందిన డీఎన్ఏ ఎఫ్‌పీ అండ్ టీసీఎం ల్యాబ్‌కు పంపినట్లు ఏసీపీ మిగతా 2లో..

# పోడు రైతుల సమస్యలపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక విచారణ

✪ ఎస్సీ,ఎస్టీ రాష్ట్ర కమిషన్ సభ్యులు జిల్ల శంకర్ భరోసా



**చింతలమానేపల్లి, మే 19, ప్రభాతవార్త:**

గిరిజన రైతులకు అటవీ శాఖ పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పోడు భూముల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ సభ్యులు జిల్ల శంకర్ స్పష్టం చేశారు. మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం కర్జవెల్లి గ్రామంలో ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, కమిషన్ సభ్యుడు ప్రవీణ్ నిలక్కలతో కలిసి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్ల శంకర్ మాట్లాడుతూ కర్జవెల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా భూతల్లిని నమ్ముకుని జీవిస్తున్న దాదాపు 50 షెడ్యూల్డ్ కులాల కుటుంబాలు ఒక్కొక్కరు 2 నుంచి 3 ఎకరాల చొప్పున సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. అయితే, వారు సాగు చేసుకుంటున్న పంటలను అటవీ అధికారులు ధ్వంసం చేసి, భూముల చుట్టూ ఫెన్సింగ్ వేశారని రైతులు చేసిన ఫిర్యాదు మేరకే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పోడు భూముల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం మిగతా 2లో..

# ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతుకు ఆటంకాలు కలగకూడదు

★ నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, మే 19, ప్రభాతవార్త**

మొక్కజొన్న దాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంగళవారం సాయంత్రం, బైంసా మండలం మాటేగాం గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ, ప్రతి రికార్డును స్పష్టంగా నిర్వహించాలన్నారు. పలు రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఇప్పటివరకు కేంద్రానికి వచ్చిన ధాన్యం, తూకం వేసి గోదాములకు మిగతా 2లో..

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

✧ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత

✧ రూ.80 లక్షల విలువైన వైద్య పరికరాలను అందజేసిన బీడీఎల్ సంస్థ

**కాగజ్‌నగర్ రూరల్,మే 19, ప్రభాతవార్త :**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రజలకు మెరుగైన చికిత్స అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ కే.హరిత అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.80 లక్షల విలువైన మిగతా 2లో..



# అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీస్, ఎక్సైజ్ సంయుక్త దాడులు



⁂ భారీ మొత్తంలో గుడుంబా స్వాధీనం ⁂ బెల్లం ఊటలు, తయారీ సామగ్రి ధ్వంసం

⁂ అక్రమ మద్యం తయారు చేస్తే కేసులు నమోదు చేస్తాం

⁂ రూరల్ సీఐ కృష్ణ

2లో..

– వేమనపల్లి, మే 19, ప్రభాతవార్త

## రూ.21.49 లక్షల విలువైన
# నకిలీ వరి విత్తనాలు పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఈ అక్రమ రవాణా ఉదంతంలో నిబంధనలు ఉల్లంఘించిన లారీ డ్రైవర్ కట్ల భద్రయ్య, సీడ్ ఆర్గనైజర్ నిమ్మటి సతీష్, సోనం సీడ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జీఎన్వీ రామకృష్ణ, లారీ యజమాని పోలవేని రాజేష్‌లపై కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు.

### రైతులారా.. మోసపోకండి..

లాభార్జనే ధ్యేయంగా నకిలీ, అనుమతులు లేని విత్తనాలను రైతులకు విక్రయించి మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ఏ. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఇలాంటి విత్తనాల వల్ల పంటలు పండక రైతులు తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయి, చివరకు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి రైతులు విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, కేవలం ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్ద, ధృవీకరించబడిన (సర్టిఫైడ్) విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఈ పత్రికా సమావేశంలో ఏసీపీతో పాటు చెన్నూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ కృష్ణ, కోటపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి ఏఓ సాయి కృష్ణ రెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఆటంకాలు కలగకూడదు

(మొదటిపేజీ తరువాయి)

తరలించిన దాన్యం వివరాలను తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో దాన్యం నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడుతూ, కొనుగోలుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న కొనుగోలు పై రైతుల ఎటువంటి ఆందోళన పడవలసిన అవసరం లేదని, సమయానికి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, రైతులు తగిన చర్యలు తీసుకుంటూ జాగ్రత్తగా ఉండాలని వివరించారు. స్థానికంగా ఉన్న హమాలీలతో మాట్లాడుతూ, ధాన్యం తరలింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. షిఫ్టులవారీగా పనిచేస్తూ లోడింగ్ ప్రక్రియ చేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ తర్వాత స్థానిక గోదామును పరిశీలించారు. అనంతరం కోతుల్ గావ్ గ్రామంలో గల గోదామును పరిశీలించారు. గోదాము నిల్వ సామర్థ్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న స్థలాలలో ధాన్యపు సంచులు నిల్వ ఉంచుకోవాలని వివరించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మార్క్ ఫెడ్ డీఎం మహేష్, తహసిల్దార్ శశి భూషణ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోడు రైతుల సమస్యలపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక విచారణ

(మొదటిపేజీ తరువాయి)

చూపిస్తామని కమిషన్ సభ్యులు భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయి పరిస్థితులపై త్వరితగతిన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలు అధికారులకు సహకరించి వివరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ప్రకాష్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి అశోక్, భూ ఎడీ సర్వేయర్ వినయ్, అటవీ డివిజనల్ అధికారి అప్పన్న, గ్రామ సర్పంచ్ నారాయణ,వివిధ శాఖల సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



పోడు రైతులతో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు జిల్ల. శంకర్

# అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీస్, ఎక్సైజ్ సంయుక్త దాడులు

వేమనపల్లి, మే 19, ప్రభాతవార్త

అక్రమంగా నిర్వహిస్తున్న గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ మొత్తంలో గుడుంబా, బెల్లం ఊటలు, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ రూరల్ నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు మంగళవారం ఉదయం చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ సమక్షంలో నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చెన్నూర్, బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సైలు, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బుయ్యారం గ్రామంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పరిసర ప్రాంతాల్లో గుర్తించిన 30 గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. అక్కడ నిల్వ ఉంచిన సుమారు 3000 లీటర్ల పులియబెట్టిన బెల్లం పానకం (గుడుంబా పానకం)ను 25 డ్రమ్‌లలో స్వాధీనం చేసుకుని సంఘటనా స్థలంలోనే ధ్వంసం చేశారు. అనంతరం సీఐ కృష్ణ గ్రామస్థులతో సమావేశమై అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయం చేయడం చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, గుడుంబా తయారీ లేదా విక్రయంలో ఎవరైనా పాల్గొన్నట్లు గుర్తిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు అక్రమ మద్యం తయారీ, వినియోగానికి దూరంగా ఉండాలని, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ సమ్మయ్య, ఎస్సై లు రమణ, వెంకటేష్ సుమారు 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో
# మెరుగైన వైద్య సేవలు అందించాలి

(మొదటిపేజీ తరువాయి)



వైద్య పరికరాలను సోమవారం అందజేశారు. బీడీఎల్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో ఈ పరికరాలను సమకూర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వ ఆసుపత్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ జిల్లాలో వైద్య సేవల అభివృద్ధికి తాను ప్రత్యేక చొరవ తీసుకొని బీడీఎల్ సంస్థను సీఎస్ఆర్ నిధులు సమకూర్చాలని కోరినట్లు తెలిపారు. సంస్థ స్పందించి రూ.80 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను అందించిందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు 6 డిజిటల్ ఎక్స్‌రే మెషీన్లు, 4 బ్లడ్ సెల్ కౌంటర్లు, 10 ఇన్ఫాంట్ వార్మర్లు, 10 స్ట్రెచర్లు మరియు 15 ఐసీయూ బెడ్స్‌ను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, బీఎస్ఎఫ్ స్వచ్ఛంద సంస్థ ట్రస్టీలు రామకృష్ణ, బాలసాయి, కైలాష్ ఇవటూరి, డీఎంహెచ్‌వో డా. సీతారాం, డీసీహెచ్ఎస్ డా. అవినాష్, డా. శ్రీధర్, డా. అరుణ, డా. హారిక, డా. విజయ్, డా. పాల్, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఖాళీల భర్తీ

ఆసిఫాబాద్, మే 19, ప్రభాతవార్త :

సఖి కేంద్రంలోని ఖాళీలను పొరుగు సేవల కింద భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ కె.హరిత అభ్యర్థులకు ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు కమిటీ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో పొరుగు సేవల కింద పని చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి ప్రతిభ ఆధారంగా భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఒక సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుకు 8 దరఖాస్తులు రాగా 8 మంది, 1 న్యాయ సలహాదారు పోస్టుకు 4 దరఖాస్తులు రాగా 4గురు, 1 కేస్ వర్కర్ పోస్టుకు 6 దరఖాస్తులు రాగా 6 గురు, 1 ఐ.టి. అసిస్టెంట్ అకౌంటెంట్ పోస్ట్ కు 6 దరఖాస్తులు రాగా 6 గురు, 1 మల్టీపర్పస్ వర్కర్ పోస్టుకు 47 దరఖాస్తులు రాగా 32 మంది హాజరయ్యారని తెలిపారు. అభ్యర్థులలో అర్హత గల వారిని ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

# సంస్థ మనుగడ లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా కృషిచేయాలి

**నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే సింగరేణి ఉనికి సాధ్యం: జీఎం మునిగంటి శ్రీనివాస్ - ఎస్సార్పీ 3, ఎస్సార్పీ I గనుల్లో రెండో రోజు మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు**

నస్పూర్, మే 19, ప్రభాతవార్త

సంస్థ మనుగడ లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సింగరేణి యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఎస్సార్పీ 3, ఎస్సార్పీ 1 భూగర్భ గనుల్లో ఈ అవగాహన సదస్సులు జరిగాయి. ఇందులో ఎస్సార్పీ 3 గనిలో జరిగిన సమావేశానికి జీఎం మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్కెట్ పోటీని తట్టుకుని సంస్థను లాభాల బాటలో నడపడానికి కార్మికులు బాధ్యతగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. గత ఏడాది నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల్లో కేవలం 74 శాతం మాత్రమే సాధించగలిగామని మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నెలలో 100 శాతం ఉత్పత్తి సాధించామని, అదే ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు. పోటీ మార్కెట్ వల్ల వినియోగదారులు ఇతర సంస్థల వైపు వెళ్తున్న నేపథ్యంలో, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితో పాటు ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవడం ఎంతో అవసరమన్నారు. దేశంలో మరే సంస్థ కల్పించని సంక్షేమ కార్యక్రమాలు, లాభాల బోనస్ అందజేస్తున్న ఏకైక సంస్థ సింగరేణి అని కొనియాడారు. సంస్థ లాభాల్లో ఉంటేనే ఇవన్నీ సాధ్యమవుతాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఎస్సార్పీ 3 గనిలో టీం 1 ప్రతినిధులు, ఎస్సార్పీ 1 గనిలో టీం 2 ప్రతినిధులు ఉద్యోగులకు సంస్థ ఆర్థిక పరిస్థితులు, రక్షణ, నాణ్యత, సంక్షేమ కార్యక్రమాలలో లోటుపాట్లపై అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో అధికారుల బృందంతో పాటు కమిటీ కన్వీనర్లు ఎన్. సత్యనారాయణ, కూర్మ రాజేందర్, గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మోతుకూరి కొమురయ్య, జీఎం చర్చల ప్రతినిధి చంద్రమోహన్ పాల్గొన్నారు. కాగా, బుధవారం టీం 1 ఆధ్వర్యంలో ఆర్.కె 5 గనిలో, టీం 2 ఆధ్వర్యంలో ఆర్.కె న్యూటెక్ గనిలో సమావేశాలు జరగనున్నాయి.



మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్



మాట్లాడుతున్న మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ



మాట్లాడుతున్న మందమర్రి గ్రూప్ ఏజెంట్ రాంబాబు



మాట్లాడుతున్న కాసిపేట 2 ఇంక్లైన్ గని మేనేజర్ లక్ష్మీనారాయణ

## కాసిపేట 2 ఇంక్లైన్ గనిపై

# ఘనంగా బహుళ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశం

- ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ఉద్యోగులు పునరంకితం కావాలి...
- మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ

**కాసిపేట, మే 19 (ప్రభాతవార్త):**

సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు సంస్థ వ్యాప్తంగా అన్ని ఏరియాలలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మందమర్రి ఏరియా పరిధిలోని కాసిపేట02 గనిలో మొదటి, రెండవ షిఫ్ట్ ఉద్యోగులతో ప్రత్యేక మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు ఘనంగా నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సమావేశాలకు పలువురు అధికారులు హాజరై ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి కాసిపేట 2 ఇంక్లైన్ గని మేనేజర్ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో కంపెనీ నిర్దేశించుకున్న ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనపై అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. భూగర్భ (అండర్‌గ్రౌండ్) మరియు ఓపెన్‌కాస్ట్ గనుల్లో అత్యాధునిక యంత్రాల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా ఉత్పాదకతను పెంచే అంశాలపై ఉద్యోగులకు వివరించారు. అలాగే సంస్థ ఉద్యోగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాలు, ఆర్థిక సంబంధిత అంశాలు, ఉద్యోగుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో కంపెనీ ఎదుర్కోబోయే సవాళ్లు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి అనుసరించాల్సిన కార్యాచరణపై కూడా సమావేశంలో చర్చించారు. యాజమాన్యం సూచించిన మార్గదర్శకాలను ఉద్యోగులు పాటించడం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతలో మరింత పురోగతి సాధించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి పూర్తి , క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పనితనాన్ని మెరుగుపరుచుకుంటే నిర్దేశించిన లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని సూచించారు. సింగరేణి సంస్థ భూగర్భ గనుల నుంచి వెలికితీసే బొగ్గు నాణ్యతను మరింత మెరుగుపరచడానికి సమగ్ర నాణ్యత నియంత్రణ చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యత గల బొగ్గును అందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బొగ్గు తవ్వకాల సమయంలో రాయి, మట్టి వంటి వ్యర్థ పదార్థాలు కలవకుండా గనిలోనే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ టు జీఎం జి.ఎల్., కాసిపేట02 గని ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి, ఆర్.వి.ఎస్.ఆర్.కే ప్రసాద్ (ఏజీఎం-ఎఫ్ అండ్ ఏ), సీహెచ్ అశోక్ (డీజీఎం పర్సనల్), కె. కిరణ్ కుమార్ (డీజీఎం-ఐఈడీ), రవి (ఐటీ డిప్యూటీ మేనేజర్), ప్రదీప్ (క్వాలిటీ ఇన్‌చార్జ్), కాసిపేట02 గని మేనేజర్ లక్ష్మీనారాయణ, సంక్షేమ అధికారి భార్గవ్, ఐఈడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్‌తో పాటు గని ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

# మీసేవ, ఇంటర్‌నెట్ సెంటర్లను తనిఖీలు చేసిన అధికారులు

### పలు సెంటర్లలో అవకతవకలపై సీరియస్ - వినియోగదారుల వద్ద అధిక డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం

**చెన్నూరు, మే 19, ప్రభాతవార్త**

మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాల్లో వినియోగదారుల వద్దనుండి అధిక డబ్బులు వసూలు చేసినట్లయితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని సంబంధిత జిల్లా అధికారులు తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో మంగళవారం రోజున పలు మీసేవ, ఇంటర్నెట్ సెంటర్లను జి.పి.ఓ భిక్షపతి, ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ కుమార్, జిల్లా మేనేజర్ జితేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతమంది ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకులు మీసేవ అప్లికేషన్లు తీసుకుని ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఆదర్శ నగర్‌లో ఉన్న సితార ఇంటర్నెట్ సెంటర్‌లో ప్రియాంక మీసేవకు (జయంతి కమ్యూనికేషన్స్) చెందిన రసీదులు లభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు డబుల్ అప్లై చేయడం, రెసిడెన్సీ, ఆదాయ ధృవపత్రాల్లో తప్పులు రావడం వల్ల ప్రజలు మళ్లీ తిరిగి దరఖాస్తులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రజలు కుల ఆదాయ ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం తప్పనిసరిగా ఆథరైజ్డ్ మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు. మీసేవ స్టేషనరీ బయట ఇంటర్నెట్ సెంటర్లలో లభించినా, మీసేవ పేరుతో అధిక వసూళ్లు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ కుమార్ స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి మీసేవ వి.ఎల్.ఈ కేంద్రంలో తప్పనిసరిగా మీసేవ సెంటర్ బోర్డు, తాజా రేట్ చార్ట్, సంబంధిత అధికారుల ఫోన్ నెంబర్లు, దరఖాస్తు చేసిన సర్టిఫికెట్ల రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని అధికారులు ఆదేశించారు. ప్రజలకు స్పష్టమైన సమాచారం కనిపించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.



# ధాన్యం దిగుమతి వేగంగా చేయాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**జైపూర్, మే 19, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో ధాన్యం దిగుమతి వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారంలో గల సుముఖ గోదాము, జయలక్ష్మి రైస్ మిల్‌లను మండల తహసిల్దార్ వనజా రెడ్డితో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాములు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో లారీల నుండి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని, రోజుకు 10 నుండి 15 లారీలు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు సిఎంఆర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జొన్నలు కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన రైతులు

**సారంగాపూర్, మే 19, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌కు రైతులు జొన్న పంటను తీసుకువచ్చారు. 20 రోజుల క్రితం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి జొన్నల కాటా ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు మార్కెట్ సిబ్బంది కొనుగోలు చేపట్టలేదు. జొన్నలు తీసుకువచ్చిన రైతులను ఎవరూ పట్టించుకోకపోవడంతో సారంగాపూర్, అడెల్లి, నాగపూర్, రవీంద్ర నగర్, చర్చి తండా, జామ్, యాకర్ పల్లి, కౌట్ల(బీ) గ్రామాలకు చెందిన 100 మంది రైతులు రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దేవి శంకర్ మద్దతు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ్ కాంత్ రావు వారితో ఫోన్లో సంభాషించి వెంటనే రైతుల జొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ తాను పై అధికారులతో, కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే జొన్నల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.



రోడ్డుపై బైఠాయించిన ధర్నా చేస్తున్న రైతులు

# ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలి

## - జైపూర్ మండలంలో పర్యటించిన అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య

**జైపూర్, మే 19, ప్రభాతవార్త**



రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల, షెట్ పల్లి, కుందారం, గంగిపల్లి గ్రామపంచాయతీలను పర్యటించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి హామీ, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. టేకుమట్లలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అవసరమైన లారీలను వెంటనే సమకూర్చాలని సంబంధిత రవాణా కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని, చెత్త సేకరణ సమయానికి నిర్వహించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి నిర్దేశిత విస్తీర్ణంలో ఇంటి నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని, ఆ దిశగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. షెట్‌పల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, హమాలీలు, లారీల సమన్వయంతో ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు కుందారం గ్రామంలోని ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. పనులు నాణ్యతతో చేపట్టడంతో పాటు కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక మహిళ తన భర్త మరణించడంతో ఉపాధి హామీ పథకం కూలి డబ్బులు బ్యాంక్ ఖాతాలో నిలిచిపోయాయని, ఇప్పించాలని కోరగా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి బాపు లను ఆదేశించారు. గంగిపల్లి గ్రామపంచాయతీని సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల శుభ్రత, చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మారాణి,మండల అభివృద్ధి అధికారి జి. సత్యనారాయణ, ఎం.పి.ఓ బాపు రావు, ఏపీఎం సంతోష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శాలువాతో సన్మానించి పంచాంగ శ్రవణ పుస్తకాన్ని అందజేస్తున్న రాజేశ్వర్ శర్మ సిద్ధాంతి

## తహసీల్దార్‌ను సన్మానించిన రాజేశ్వర్ సిద్ధాంతి

**సారంగాపూర్, మే 19, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్ కాంత్ రావును మండల పంతులు రాజేశ్వర్ శర్మ సిద్ధాంతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించి పంచాంగ శ్రవణ పుస్తకాన్ని అందజేశారు. అనంతరం జామ్ గ్రామ పంచాయతీ అధికారి రమేష్‌ను సన్మానించారు.



## ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల

**సారంగాపూర్, మే 19, ప్రభాతవార్త:**

మండలంలోని జోళీ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రూపురేఖలను నూతన సర్పంచ్ కొమ్ము సురేందర్ మార్చారు. ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద మంజూరైన రూ.8 లక్షల నిధులతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేసి, విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలను మెరుగుపరిచారు. ఖిమన ఊరు మన బడిఖి కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ మార్పుతో గ్రామంలోని పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేలా అన్ని వసతులు కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ మార్పును గమనించి, మన బడిని కాపాడుకోవడం కోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సర్పంచ్ కోరారు.

## నిమ్మల ప్రవీణ్‌కు స్వాగతం పలికిన కోఆప్షన్ సభ్యులు

**భైంసా, మే 19, ప్రభాతవార్త:**

పట్టణంలోని మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికలను నిలిపివేయాలని ప్రతిపక్ష ఎంఐఎం నాయకుడు ఇమ్తియాజ్ తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో, అడ్వకేట్ నిమ్మల్వార్ ప్రవీణ్ ఆయన బృందం కీలక పాత్ర పోషించారు. సంబంధిత అంశంపై కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించి, ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా ఉత్తర్వులు పొందడంలో విజయవంతమయ్యారు. హైకోర్టు అనుమతితో మంగళవారం ముగ్గురు కోఆప్షన్ సభ్యుల ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. ఈ విజయానికి అడ్వకేట్ నిమ్మల్వార్ ప్రవీణ్ బృందం చేసిన న్యాయపరమైన కృషి ప్రధాన కారణం కావడంతో నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు జిల్లాలో పర్యటించనున్న మంత్రులు

**ఆసిఫాబాద్, మే 19, ప్రభాతవార్త :**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2న జిల్లాలో పర్యటన నేపథ్యంలో బుధవారం రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు జిల్లాకు రానున్నారు. ఈ నెల 20న మధ్యాహ్నం 1 గంటలకు హెలికాప్టర్‌లో ఆసిఫాబాద్‌కు బయలుదేరుతారని, 2 గంటలకు ఆసిఫాబాద్‌లోని ఐడీఓసీకు చేరుకుంటారని, 2:15 నుండి సాయంత్రం 4:45 వరకు ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. దీనిలో బాగాంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను నిర్వహించే కాగజ్ నగర్ ఎక్స్ రోడ్, వంజరి, దాదానగర్ ప్రాంతాలను మంగళవారం జిల్లా కలెక్టర్ కె హరిత, జిల్లా ఎస్పీ నితికపంత్, ఎమ్మెల్సీ దండేవిటల్ జిల్లా అధికారులు తదితరులు పరిశీలించారు.



సిఎం పర్యటన స్థలంను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీ




## నేటి మెడికల్ షాపుల బంద్‌కు సహకరించాలి

### - ఐఎంఏ అధ్యక్షుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్‌ను కోరిన కెమిస్ట్స్&డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్

**కాగజ్‌నగర్ రూరల్,మే 19, ప్రభాతవార్త :**

ఆన్లైన్‌లో మందుల విక్రయాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఇచ్చిన దేశవ్యాప్త బంద్ పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీన అన్ని మెడికల్ షాపులను బంద్ చేయనున్నట్లు కెమిస్ట్స్ మరియు డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఐఎంఏ అధ్యక్షుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆన్లైన్ మందుల విక్రయాలకు సంబంధించిన ఇచ్చిన ఆదేశాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ ద్వారా నకిలీ, నాణ్యతలేని మందులు ప్రజలకు చేరుతున్నాయని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆన్లైన్ మెడిసిన్ సేవలను పూర్తిగా నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల ఆరోగ్య భద్రత కోసం మెడికల్ రంగానికి చెందిన ప్రతి ఒక్కరూ ఈ బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ బంద్‌కు జిల్లా, పట్టణ రిటైల్ మెడికల్ అసోసియేషన్స్, హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్స్, జనరల్, జనరిక్, సర్జికల్ అసోసియేషన్ సభ్యులందరూ సంయుక్తంగా మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీర్ మండల్, కార్యదర్శి పత్తి సందీప్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరీష్ పెద్ది తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ టౌన్, మే 19, ప్రభాతవార్త :**

ప్రజారోగ్య పరిరక్షణ కోసం మెడికల్ దుకాణాలు బంద్ చేస్తున్నట్లు మెడికల్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బంద్ బుధవారం (20న ) దేశ వ్యాప్తంగా ఉండనున్నట్లు తెలిపారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలకు నిరసనగా టిటిసిడిఏ, బికెడిసిడిఏ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మెడికల్ షాపులు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ మందులతో ప్రజారోగ్యానికి ముప్పు ఉందని, ఫార్మా రంగంలో ఎదురవుతున్న సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్ కు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

# రైతులకు అందుబాటులో గోడౌన్

**ఆసిఫాబాద్ టౌన్, మే 19, ప్రభాతవార్త**



జిల్లాలోని రైతులకు అందుబాటులో గోడౌన్లు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. వెంకట్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారిగా కొరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (గ్రోమోర్) సంస్థ ఏర్పాటుచేసిన నూతన గోడౌన్‌ను డిఏఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఏఓ మాట్లాడుతూ రైతులకు ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తులు సమయానికి అందుబాటులో ఉండేలా ఈ గోడౌన్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ గోడౌన్ ద్వారా ఆసిఫాబాద్ జిల్లా డీలర్స్‌కు స్టాక్స్ సరఫరా ప్రారంభించబడిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి దిలీప్, సీనియర్ జోనల్ మేనేజర్ సజన్ కుమార్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ శ్రవణ్ రెడ్డి, బ్రాండింగ్ మేనేజర్ వెంకటేష్, మంచిర్యాల్, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన డీలర్స్ ఆశిష్, శ్రీనివాస్, శ్రీధర్, ప్రకాష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నస్పూర్, మే 19, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం సబ్బపల్లి లోని గోదాము, నస్పూర్ మండల కేంద్రంలోని గోదాము, లక్షెట్టిపేట మండలం గుల్లకోట లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, వెంకట్రావుపేట లోని గోదాము, లక్ష్మీపూర్ లలో గల రైస్ మిల్లులను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, దండేపల్లి మండలం కన్నెపల్లిలో గల రైస్ మిల్లును మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, తరలింపు ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. రైస్ మిల్లుల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాలనుండి వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, ఇందుకు అవసరమైన హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో త్వరగా సాధించే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. లారీల యజమానులు ధాన్యం తరలింపులో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని, తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెడికల్ దుకాణాల యజమానులు

## నేడు మెడికల్ దుకాణాల బంద్

**కౌటాల, మే 19, ప్రభాతవార్త:**

ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న మెడికల్ దుకాణాల బంద్‌కు మద్దతుగా స్థానిక తహసిల్దార్‌కు వినతిపత్రం అందిస్తూ బంద్ కు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మందుల విక్రయాల వల్ల చిన్న మెడికల్ దుకాణాల వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల సూచనలు లేకుండా మందులు సులభంగా అందుబాటులోకి రావడం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఆన్‌లైన్ మందుల అమ్మకాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేడు దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ కెమిస్ట్ అండ్ రిజిస్టర్ ఇచ్చిన పిలుపుమేరకు మెడికల్ దుకాణాల బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, మెడికల్ దుకాణాల యజమానులు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

## జైపూర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా కాసిపేట సతీష్

**జైపూర్, మే 19, ప్రభాతవార్త**



మంచిర్యాల డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి నేతృత్వంలో జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల విశ్వంబర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల పార్టీ కమిటీలను ప్రకటించారు. జైపూర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కాసిపేట సతీష్ కుమార్ ను నియమించారు. తనపై నమ్మకంతో రెండో సారి సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించినందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకట స్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, (మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ) డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల విశ్వంబర్ రెడ్డిలకు కాసిపేట సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన డీపీఓ వెంకటేశ్వర్‌రావు

**చెన్నూరు, మే,19, ప్రభాతవార్త**

కొనుగోలు కేంద్రాల్లోని వడ్లను త్వరితగతిన రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలో మంగళవారం రోజున కిష్టంపేట, భావరావుపేట, ఓత్కులపల్లి, అస్నాద్ గ్రామాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లోని వడ్లను త్వరితగతిన కొనుగోలు చేసి పంపాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు తహశీల్దార్ మల్లికార్జున్, ఏండి అజ్మత్ అలీ, మండల పంచాయతీ అధికారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అజీజ్, ఏపీ.ఎం వెంకటేశ్వర్, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

## పంట మార్పిడితో అధిక ఆదాయం

**చింతలమానేపల్లి, మే 19, ప్రభాతవార్త**

మండలంలోని రణవెల్లి గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల్తు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.అమీర్ భాష, డా.అర్చన కరునీ హాజరై రైతులకు పలు సూచనలు చేశారు.మట్టి నమూనాల సేకరణ, భూ ఆరోగ్య కార్డుల ఆధారంగానే ఎరువులు వాడాలని, యూరియాను సమతుల్యంగా వినియోగించాలని కోరారు. అధిక ఆదాయం కోసం పంట మార్పిడి, పంట వివిధ్ధీకరణ చేపట్టాలన్నారు. సాగుకు అనువైన ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, బీపీటీ 5204, డబ్ల్యూజీఎల్ 44, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్ వంటి సన్నధాన్యం వరి రకాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ యూరియా బుకింగ్ యాప్, ఫార్మర్ రిజిస్ట్రీ, సేంద్రియ వ్యవసాయం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోల్కర్ జనాబాయి, ఉప సర్పంచ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు

**తాండూర్, మే 19, ప్రభాతవార్త**




మండలంలోని నర్సాపూర్ లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దాగం రాజారాంమాట్లాడుతూ పేదల పక్షపాతి, కార్మిక, కర్షక ఉద్యమ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల శంకర్, ఆత్రం బాజీరావు, కోట్నాక శ్యామ్ రావు, కుర్సింగ లింగారావ్, సోయం ప్రభాకర్, సోయం గంగు, కుర్సింగ సోనేరావు, నాయకులు పాల్గొన్నారు.



అంబులెన్స్ లోని పరికరాలను, రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

## అంబులెన్స్ సేవల పనితీరుపై సమీక్ష

**కౌటాల, మే 19, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని 108, 102 అంబులెన్స్ సేవల పనితీరును ఆదిలాబాద్ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ సమ్రాట్, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మేనేజర్ కొండల్‌రావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లలోని వైద్య పరికరాల పనితీరు, అత్యవసర సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వడదెబ్బ బాధితులు వచ్చిన సందర్భంలో ఐస్ ప్యాక్‌లతో ప్రాథమిక చికిత్స అందిస్తూ అవసరమైన సంరక్షణను అంబులెన్స్‌ల్లోనే కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్‌లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజలు ప్రస్తుతం పెరుగుతున్న ఎండల దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, బాధితులకు వేగంగా సేవలు అందించాలని సూచించారు. అవసరమైతే తప్ప ఎండల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు ఆరోగ్య పరంగా మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వారి వెంట విగ్నేష్, సురేష్, సాయిక్రిష్ణ, అరవింద్‌లు ఉన్నారు.

## మండల విద్యావనరుల కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన సెక్టోరియల్ ఆఫీసర్లు

**జన్నారం, మే 19, ప్రభాతవార్త**



జన్నారం మండల విద్యావనరుల కేంద్రాన్ని మంగళవారం నాడు జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్లు భరత్ కుమార్, సత్తయ్య, కృష్ణమూర్తి, విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇట్టి తనిఖీలో పాఠశాలలో విద్యార్థుల యొక్క ప్రోగ్రెషన్ యాక్టివిటీ ని త్వరగా పూర్తి చేయాలని, అలాగే వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదును ప్రభుత్వ పాఠశాలలలో 10 శాతం ఇంక్రీజ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్ విజయ్ కుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేష్, సిఆర్‌పిలు నీలం శేఖర్, దయాకర్, శివకుమార్, రవి, బుచ్చయ్య, మెసెంజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# శారద హత్యకేసును ఛేదించిన పోలీసులు

**చెన్నూరు, మే 19, ప్రభాతవార్త :**



వివరాలు వెల్లడిస్తున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని ఎల్లక్కపేట గ్రామంలో సోమవారం రోజున చల్ల శారద,ను తన భర్త చల్ల రమేష్ సుత్తితో బాది హత్యచేసిన కేసును పోలీసులు ఛేదించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రోజున మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చల్ల శారద (27) ను భర్త చల్ల రమేష్ (30) అతని స్నేహితుడు గంధం సారయ్య సహాయంతో హత్య చేసినట్లు తెలిపారు. ఈ హత్యలో శారద అత్తమామలు,చల్ల వెంకటమ్మ, చల్ల అబ్బయ్య, ఆడపడుచు పుష్పలత వాళ్ళ ప్రోద్బలం ఉందన్నారు. అదనపు కట్నం కొరకు వేదించేవాడని, ఎలాగైనా తనను అడ్డు తొలగించుకోవాలని ఎల్లక్కపేట లోని తన ఇంటి వద్ద సుత్తి తో ఆమె తలపై బాది హత్య చేసాడని శారద తండ్రి పురాణం ఎల్లయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు చెన్నూర్ పట్టణ పోలీసుల అధ్వర్యంలో దర్యాప్తు ప్రారంబించి కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈరోజు చెన్నూర్ పట్టణ సీఐ,ఎస్ఐలు పోలీస్ సిబ్బంది తో కలసి విచారణ చేపట్టి శారద ను హత్య చేసిన చల్ల రమేష్ ను, అతనికి సహకరించిన గంధం సారయ్యను ఈరోజు ఉదయం 11 గంటల సమయంలో ఎల్లక్కపేట సింగరేణి క్వార్టర్స్ ఏరియాలో పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితులను విచారించగా రమేష్ కు అతని భార్యకు మధ్య గత సంవంత్సర కాలంగా గొడవలు జరుగుతున్నాయని, వారిమధ్య చాలాసార్లు పంచాయతీలు జరిగాయని, రమేష్ తన తల్లి దండ్రులు, ఆడపడుచు, ప్రోద్భలంతో అదనపు కట్నం కొరకు వేదించడమే గాక రమేష్ భార్య శారద తరచు తన పుట్టింటికి వెళ్ళిపోవడం, తన భార్యకు మరొకరితో సంబంధం ఉందన్న అనుమానంతో ఆమెను ఎలాగైనా అడ్డు తొలిగించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడన్నారు. నిన్న మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన స్నేహితుడు గంధం సారయ్య కు ఫోన్ చేసి తన ఇంటికి పిలిపించుకొని అతని సహాయంతో శారద ను సుత్తి తో తలపై పలుమార్లు గట్టిగా కొట్టడంతో ఆమె చనిపోయిందని నిర్ధారించుకొన్న తర్వాత సారయ్య అక్కడినుండి పారిపోయాడని, రమేష్ శారదను చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి అ అక్కడినుండి తప్పించుకుని సారయ్య రమేష్ ఇరువురు కలసి ఎల్లక్కపేట లోని మూతబడిన సింగరేణి క్వార్టర్స్ నందు దాక్కొని ఉండగా నమ్మదగిన సమాచారం మేరకు వారిని పట్టుకొని, వారివద్దనుండి శారదను హత్యచేయుటకు ఉపయోగించిన సుత్తిని, రక్తపు మరకలు అంటిన వారిద్దరి దుస్తులను, మొబైల్ ఫోన్స్ లను స్వాధీన పరుచుకున్నామన్నారు. అనంతరం వీరిద్దరితోపాటు, రమేష్ తల్లిదండ్రులు అయిన వెంకమ్మ, అబ్బయ్య చెల్లెలు పుష్పలతను పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి ఆరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం మంచిర్యాల న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ ఐ లు శ్యామ్ పటేల్, రాజశేఖర్ చెన్నూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోఆప్షన్ ఎన్నికల్లో పంతం నెగ్గించుకున్న ఎమ్మెల్యే

**భైంసా, మే 19, ప్రభాతవార్త:**



భైంసా మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పంతం నెగ్గించుకున్నారు. మొదట్లో జరిగిన మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో బీజేపీ కౌన్సిలర్లను తప్పుదోవ పట్టించడంతో అప్పట్లో ఎన్నిక రసాభాసగా మారి వాయిదా పడగా, మంగళవారం మూడు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ మద్దతుదారులు విజయం సాధించారు. దీంతో నాలుగు కోఆప్షన్ స్థానాల్లో మూడు బీజేపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఎన్నిక ప్రారంభం కావడంతో ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు, ఏడుగురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుని హోదాలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. ఎంఐఎం కౌన్సిలర్లు గైరాజరు కావడంతో కోఆప్షన్ ఎన్నిక ఏకపక్షమైంది. అనుకున్న స్థానాలు లేకపోయినప్పటికీ ఎంఐఎం పార్టీ కోఆప్షన్ మెంబర్లను దక్కించుకోవడానికి ఎత్తులు వేసి, పలు ఆరోపణలు చేసినప్పటికీ ఎమ్మెల్యే పటేల్ ముందు ఎలాంటి పాచికలు పారలేదు. మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి నాయకత్వంలో కౌన్సిలర్లు హైకోర్టుకు వెళ్లగా ఎన్నిక నిర్వహించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా తోట లింగురాం, ముజీబ్ అహ్మద్, అల్లకొండ కవిత ఎన్నికయ్యారు. ఇందులో తోట లింగురాం, ముజీబ్ అహ్మద్‌లు గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లుగా పదవులు చేపట్టగా, అల్లకొండ కవిత గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. వీరికి నియామక పత్రాలను సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్మన్ తుమ్మోల దత్తాత్రి, కమిషనర్ లింగయ్య అందజేశారు. బీజేపీ మద్దతుదారులు ముగ్గురు కోఆప్షన్ సభ్యులుగా ఎన్నిక కావడంతో మున్సిపల్ కార్యాలయం ముందు సంబరాలు మిన్నంటాయి. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ వైస్ చైర్మన్ అభిమానులు టపాసులు పేల్చి ఆనందాన్ని పంచుకుంటూ హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వారితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. తమ నేత ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని మున్సిపల్ చైర్మన్ తుమ్మోల దత్తాత్రి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్‌ను హెచ్చరించారు. కోఆప్షన్ ఎన్నిక ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మరోమారు ఇలాంటి ఆరోపణలు చేస్తే తగిన రీతిలో సమాధానం చెబుతామన్నారు. గతంలో తప్పుదోవ పట్టించి ఎంఐఎం పార్టీ ఒక కోఆప్షన్ స్థానాన్ని దక్కించుకున్న విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

# అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు: మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్

**కోటపల్లి, మే 19 ప్రభాతవార్త**



రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా అక్రమంగా పశువులను తరలించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాపన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఆయన పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అక్రమ జంతు రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పశువుల సంతలపై నిఘా ఉంచామని చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా చట్టవిరుద్ధంగా ఆవులు, దూడలను అక్రమంగా రవాణా చేయడం, వధించడం పూర్తిగా నిషేధమని, అలాంటి చర్యలకు పాల్పడితే రాజీ లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద 24/7 నిరంతర నిఘా ఏర్పాటు చేశామని, రవాణా సమయంలో సంబంధిత చట్టాలు, నిబంధనలు, సరైన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా పశువుల అక్రమ రవాణా, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలంతా పరస్పరం మతాలను గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, మహారాష్ట్ర వైపు నుంచి అక్రమ ధాన్యం వడ్లు రవాణా జరగకుండా వ్యవసాయ, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుని తనిఖీలు నిర్వహించాలని, వేరే రాష్ట్రం నుంచి ధాన్యం వచ్చినట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీసీపీ వెంట జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, భీమారం ఎస్సై రాజేందర్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

# దినసరి కూలీల వేతనం 20 శాతం పెంపు

**ఆసిఫాబాద్, మే 19, ప్రభాతవార్త :**

అసంఘటిత రంగ తాత్కాలిక కార్మికులు, దినసరి కూలీలకు దినసరి వేతనం 20 శాతం పెంచడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో దినసరి కూలీల వేతనం పెంపుపై పలు శాఖల అధికారులతో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో 202223 ఆర్థిక సంవత్సరంలో దినసరి కూలీల వేతనం పెంచడం జరిగిందని, 202627 ఆర్థిక సంవత్సరానికి గాను 20 శాతం పెంచుతూ కమిటీ తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ పెంపు ద్వారా నైపుణ్యం లేని కార్మికులకు, కొంతమేర నైపుణ్యం కలిగిన కార్మికులు, నైపుణ్యం గల దినసరి కూలీలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి క్రాంతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలలలో డిజిటల్ విద్యా బోధనకు చర్యలుప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యా బోధనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ తో కలిసి డిజిటల్ బోధనపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ తరగతుల ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్య ప్లస్ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా విద్యా బోధన అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానం ద్వారా స్మార్ట్ మూల్యాంకనాలు, ఉపాధ్యాయులకు సహాయక వ్యవస్థలు, తరగతి గదులపై పర్యవేక్షణ, డిజిటల్ లెర్నింగ్ వర్క్ ఫ్లో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అనంతరం సమగ్ర ప్రాజెక్టుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తక్కువ యూరియా వాడకంతో నేల ఆరోగ్య పరిరక్షణ

## - ప్రకృతి పరిరక్షణలో రైతుల పాత్ర కీలకం

## - జంబుగ రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం - రైతులకు అవగాహన

**కాగజ్‌నగర్ రూరల్,మే 19, ప్రభాతవార్త :**

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగులో ఖర్చుల తగ్గింపు, సుస్థిర వ్యవసాయం పై అవగాహన కల్పించే లక్ష్యంతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా గ్రామ రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ తక్కువ యూరియా వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా నేల ఆరోగ్యం కాపాడబడుతుందని తెలిపారు. అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడాలని సూచించారు.అలాగే పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా నేల సారవంతత పెరిగి రైతులకు సుస్థిర ఆదాయం లభిస్తుందని వివరించారు. మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని రైతులకు తెలియజేశారు. సాగునీటిని ఆదా చేస్తూ భావితరాలకు సహజ వనరులను సంరక్షించాలని సూచించారు.సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి మరియు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో రైతుల పాత్ర ఎంతో ముఖ్యమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. సిహెచ్ భరత్ భూషణ్ రావు, డా. డి. శిరీష, ఏఓ రామకృష్ణ, ఏఈఓ సృజన, ఆత్మ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ గజ్జి లింగయ్య, ఉప సర్పంచ్ కట్టేకోల పొచమళ్ళు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు